రేపు నాబార్డ్ అధ్వర్యంలో స్టేట్ క్రెడిట్ సెమినార్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నేషనల్ బ్యాంక్ ఫర్ అగ్రికల్చర్ అండ్ రూరల్ డెవలప్‌మెంట్(నాబార్డ్) ఆధ్వర్యంలో ఈనెల 14న స్టేట్ లెవెల్ క్రెడిట్ సెమినర్ 2025-26 నిర్వహిస్తున్నట్లు నాబార్డ్ డీజీఎం టీప్తిసునీత్ తెలిపారు. వ్యవసాయ ఆధారిత అనుబంధ విభాగాల అభివృద్ధికి నాబార్డ్ చేపట్టే పలు కార్యక్రమాలతో రూపొందించిన పుస్తకాన్ని ఈ సందర్భంగా రాష్ట్ర ఉపముఖ్యమంత్రి, ఆర్థికశాఖ మంత్రి మల్లు భట్టివిక్రమార్క ఆవిష్కరిస్తారని వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు అతిథిగా పాల్గొంటారని వివరించారు. బ్యాంక్ స్టేక్‌హోల్డర్స్, రాష్ట్రప్రభుత్వంలోని వివిధ శాఖల విభాగాల ప్రతినిధులు పాల్గొంటారని వివరించారు.

ఆకట్టుకున్న గానవిభావరి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గాయకుడు ఘంటసాల జయంతి సందర్భంగా త్యాగరాయగాన సభలో మంగళవారం రాత్రి అర్చన కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన గానవిభావరి ఆకట్టుకుంది. అర్చన వెంకటేశ్వరరావుతోపాటు సీహెచ్ లలిత, శేఖరుడు, శేఖర్, డీప మిత్ర, డి.నీత తదితరులు ఘంటసాల పాటలు ఆలపించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో న్యూఇండియా అష్యూరెన్స్ కంపెనీ పూర్వ అధికారి హరిశ్రీనివాస్, ఎస్‌బీఐ మాజీ ఏజీఎం చింతలపూడి త్రినాథరావు తదితరులు పాల్గొని మాట్లాడుతూ సూర్యచంద్రులు ఉన్నంతకాలం ఘంటసాల గానం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో రవీందర్‌రెడ్డి, డీఎస్ఎన్ మూర్తి, శోభన్, దమయంతి, రామలక్ష్మి, అఖిల, ఉదయ్‌కుమార్ పాల్గొన్నారు.

ఆలయాల్లో సత్యనారాయణస్వామి వ్రతాలు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మాఘపౌర్ణమిని పురస్కరించుకుని ఆలయాల్లో బుధవారం సామూహిక సత్యనారాయణస్వామి వ్రతాలను నిర్వహించారు. ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని లక్ష్మీగణపతి దేవాలయంలో, వివేకనగర్‌లోని ఆంజనేయస్వామి ఆలయం, చిక్కడపల్లిలోని వేంకటేశ్వరస్వామి ఆలయాల్లో జంటలు వ్రతాలు చేశారు.

త్వరలో టీటీఏ దశాబ్ది ఉత్సవాలు

నల్లకుంట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, తెలంగాణ విభజన తర్వాత అమెరికాలో తెలంగాణ అమెరికా తెలుగు అసోసియేషన్(టీటీఏ) ఆధ్వర్యంలో దశాబ్ది ఉత్సవాలను నిర్వహిస్తున్నామని టీటీఏ అధ్యక్షుడు మలిపెద్ది నవీన్‌రెడ్డి, ఇండియా కో-ఆర్డినేటర్ డాక్టర్ ద్వారకనాథ రెడ్డి పేర్కొన్నారు. బుధవారం హైదర్‌గూడలో వారు విలేకరులతో మాట్లాడుతూ ఈ దశాబ్ది ఉత్సవాల్లో రాష్ట్రవ్యాప్తంగా టీటీఏ (సేవాడేస్) సేవా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు.

20న సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ చలో హైదరాబాద్

రాంనగర్, ఆంధ్రజ్యోతి: కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు, ఆరు గ్యారంటీలను అమలు చేయాలని కోరుతూ ఈనెల 20న సీపీఐ (ఎంఎల్) న్యూడెమొక్రసీ ఆధ్వర్యంలో నిర్వహించే చలో హైదరాబాద్ పోస్టర్ ఆవిష్కరణ బుధవారం విద్యానగర్‌లోని మార్క్స్‌భవన్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో నాయకులు జెవి.చలపతిరావు, సాదినేని వెంకటేశ్వరరావు, కె.గోవర్ధన్, ఝాన్సీ, అరుణ, అనురాధ, మహేష్ పాల్గొన్నారు.

నల్లకుంటలో గురు రవిదాస్ జయంతి వేడుకలు

నల్లకుంట, ఆంధ్రజ్యోతి: జన సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కె.వెంకటనారాయణ ఆధ్వర్యంలో గురు రవిదాస్ జయంతి వేడుకలను పురస్కరించుకుని బుధవారం నల్లకుంట మెయిన్ రోడ్‌లోని లిడ్‌క్యాప్ షాపు వద్ద గురు రవిదాస్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో ఏ.రత్నమాల, శివకుమార్, కన్నయ్యకుమార్ పాల్గొన్నారు.

తాండ్రకుమార్ వర్ధంతి సభ వాల్‌పోస్టర్ ఆవిష్కరణ

రాంనగర్: ఎంసీపీఐయూ రాష్ట్ర పొలిట్‌బ్యూరో సభ్యులు, రాష్ట్ర కార్యదర్శి తాండ్రకుమార్ మూడో వర్ధంతి ఈనెల 14 నుంచి 21వ తేదీ వరకు నిర్వహించాలని ఎంసీపీఐయూ నిర్ణయించింది. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్‌ను బుధవారం బాగ్‌లింగంపల్లిలోని ఓంకార్ భవన్‌లో పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వనం సుధాకర్, వి.తుకారాం నాయక్, సభ్యులు పాండురంగాచారి, బి.యాదగిరి, మార్టిన్, లక్ష్మణ్ ఆవిష్కరించారు.

'నిత్యావసరాలపై జీఎస్టీ పన్నులు రద్దు చేయాలి'

రాంనగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): నిత్యావసరాలపై జీఎస్టీ పన్నులు రద్దు చేయాలని, మధ్యతరగతి ప్రజలకు 12 లక్షల పన్ను మినహాయింపు ఒట్టి మాటలేనని అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం సహాయ కార్యదర్శి రాజ్యసభ సభ్యుడు శివదానన్ పేర్కొన్నారు. బుధవారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.నాగయ్య అధ్యక్షతన కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ - గ్రామీణ పేదలపై ప్రభావం అనే అంశంపై సదస్సు జరిగింది. ఈ సదస్సుకు ముఖ్యఅతిథిగా హాజరైన శివదానన్ మాట్లాడుతూ ఉపాధి హామీ పథకానికి ప్రభుత్వం మొండిచెయ్యి చూపిస్తుందని ఆరోపించారు. బడా వ్యాపారులకు మేలు చేసే విధంగా బడ్జెట్ రూపొందించారని విమర్శించారు. ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల స్కాలర్‌షిప్, సబ్‌ప్లాన్ నిధులను వారి జనాభా ఆధారంగా నిధులు కేటాయించలేదని ఆరోపించారు. ప్రధానమంత్రి ఆవాస్‌యోజన పేదలకు కట్టించే ఇళ్ల స్లాబ్‌లను పెంచాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం సహాయ కార్యదర్శి విక్రమ్‌సింగ్, మాజీ ఎమ్మెల్యే లాజరస్, నాయకులు వెంకటేశ్వర్లు, ఆర్.వెంకట్, రాములు, బిప్రసాద్, పద్మ, శశిధర్, రవీందర్, జంగయ్య రమేష్ తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరు ప్రాంతాల్లో ముగ్గురి మృతి

వేర్వేరు ప్రాంతాల్లో బుధవారం ముగ్గురి మృతి చెందారు. రైలు బోగీలో గుర్తు తెలియని వ్యక్తి, నడుస్తున్న రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని యువకుడు, గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ ప్రైవేట్ సెక్యూరిటీగార్డు దుర్మరణం చెందారు.

డెమో రైలులో గుర్తుతెలియని వ్యక్తి..


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

బర్కత్‌పుర, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాయచూర్ - కాచిగూడ డెమో రైలు బోగీలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. రైలు బోగీలో 70 ఏళ్ల వయసుగల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. రైలు కాచిగూడ రైల్వే స్టేషన్‌లో నిలువగా క్లీనింగ్ సిబ్బంది చూసి సమాచారం అందించారని తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఉస్మానియా ఆస్పత్రి మార్చురీకి తరలించామని తెలిపారు. మృతదేహాన్ని చూసి గుర్తు పట్టేవారు 8712658584 ఫోన్ నెంబర్‌కు సమాచారం అందించాలని తెలిపారు.

రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని యువకుడు..

నడుస్తున్న రైలు నుంచి జారిపడి గుర్తు తెలియని యువకుడు మృతి చెందాడు. కాచిగూడ రైల్వే పీఎస్ సీఐ ఎల్లప్ప తెలిపిన వివరాల ప్రకారం.. ఆర్ట్స్ కళాశాల - జామైఉస్మానియా రైల్వే స్టేషన్ల మధ్య 25 ఏళ్ల వయసుగల గుర్తు తెలియని యువకుడు నడుస్తున్న రైలు నుంచి కిందపడిపోయాడు. ఈ ప్రమాదంలో తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. రైల్వే ట్రాక్ లైన్‌మెన్ ఈ సంఘటన చూసి సమాచారం అందించారని తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

వాహనం ఢీకొని సెక్యూరిటీగార్డు..

కాచిగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో గుర్తుతెలియని వాహనం ఢీకొని ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు మృతి చెందాడు. కాచిగూడ పీఎస్ అడ్మిన్ ఎస్ఐ బీను బాష్ తెలిపిన వివరాల ప్రకారం. దోమలగూడలో నివాసం ఉంటున్న కొంపల్లి కిషన్(47) ప్రైవేట్ సెక్యూరిటీ గార్డు. మంగళవారం అర్ధరాత్రి కాచిగూడ ఆర్టీసీ బస్టాండ్‌లో గుర్తుతెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో వ్యక్తికి 22 రోజుల జైలు

బర్కత్‌పుర, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మద్యం తాగి, వాహనం నడుపుతూ నాల్గో సారి ట్రాఫిక్ పోలీసులకు దొరికిన ఓ వ్యక్తికి 22 రోజుల జైలు శిక్ష పడింది. కాచిగూడ ట్రాఫిక్ సీఐ శ్రీనివాసరావు తెలిపిన వివరాల ప్రకారం. మరో నలుగురు వ్యక్తులకు రెండు రోజుల జైలు శిక్షను నాంపల్లిలోని 7వ జెఎంఎఫ్‌సీ కోర్టు విధించిందని ఆయన తెలిపారు.

కొరవడిన పచ్చదనం

- పార్కులో అసాంఘికశక్తుల తిష్ట
- ఇబ్బంది పడుతున్న సందర్శకులు, వాకర్లు



పచ్చగడ్డి లేకపోవడంతో వెలవెలబోతున్న పార్కు ప్రాంగణం, గార్డురూమ్‌కు వేసి ఉన్న తాళం

చిక్కడపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అశోక్‌నగర్ వెల్ఫేర్‌సెంటర్ పక్కనున్న అశోక్‌నగర్ పార్కులో పచ్చదనం కొరవడింది. పార్కులో రాత్రి వేళల్లో అసాంఘిక శక్తులు తిష్ట వేస్తున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు యువకులు, వైట్‌నర్ గ్యాంగ్‌లు పార్కులో చేరి సందర్శకులు, వాకర్‌లను ఇబ్బంది పెడుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. పార్కులో వీధిదీపాలు ఏర్పాటు చేయకపోవడంతో అంధకారం నెలకొంది. రాత్రి పూట పార్క్ గేటుకు తాళం వేయకపోవడంతో పలువురు జంటలు పార్కులో చేరిపోయి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నారని కాలనీవాసులు చెప్తున్నారు. కాలనీలోని వారు రోజూ ఉదయం పార్కులో వాకింగ్ చేయడానికి వస్తుంటారు. పార్కులోని బెంచీలపై పడుకున్నవారు కనిపిస్తుంటారు. పార్కులోకి తెచ్చుకున్న తినుబండారాలు పార్కులోనే పారేయడంతో పాత్‌వే అంతా చెత్తగా మారింది. పార్కును శుభ్రం చేయకపోవడంతో అపరిశుభ్రంగా ఉంది. పార్కులోకి ప్రవేశించగానే ఎడమ ప్రక్కన చెత్త కనిపిస్తుంది. చెత్తను ఎత్తకపోవడంవల్ల పార్కులో దుర్వాసన వస్తుంది. పార్కులో గార్డ్ లేకపోవడంతో పార్కు ఆలనాపాలనా పట్టించుకునేవారు లేకుండా పోయారని కాలనీవాసులు చెబుతున్నారు. గతంలో పార్కు మధ్యలో ఫౌంటేయిన్ పనిచేసేది. ఇప్పుడు అది పనిచేయడంలేదు. గార్డు రూమ్ పక్కన చాటు ప్రాంతంలో రాత్రిపూట అసాంఘికశక్తులు చేరి అసాంఘికకార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా చర్యలు తీసుకోవాలని పార్కును శుభ్రంగా ఉంచాలని, పార్కులో వీధిదీపాలు ఏర్పాటు చేసి రాత్రివేళల్లో వెలిగేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు కోరుతున్నారు.

పార్కును శుభ్రంగా ఉంచాలి



అశోక్‌నగర్ పార్కును ఎప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలి. ఎంపీ లక్ష్మణ్ వంటి ప్రముఖులు, కాలనీవాసులు ఈ పార్కులో రోజూ వాకింగ్ చేస్తారు. మహిళలు, సందర్శకులు, పిల్లలు, వృద్ధులు పార్కులో సేద తీరేవిధంగా ఏర్పాట్లు చేయాలి. పార్కులో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తే బాగుంటుంది.

- బి.సూర్యప్రకాశ్, స్థానికుడు, అశోక్‌నగర్ కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్

పార్కులో అసాంఘికశక్తులు లేకుండా చర్యలు



అశోక్‌నగర్ పార్కులో అసాంఘికశక్తులు లేకుండా చర్యలు తీసుకుంటాం. ఈ మేరకు చిక్కడపల్లి పోలీసులకు సూచనలు చేస్తా. పార్కును ఆహ్లాదకర వాతావరణంలో తీర్చిదిద్దేవిధంగా జీహెచ్ఎంసీ హార్టికల్చర్ విభాగం వారిని పిలిచి మాట్లాడుతా. ముఖ్యంగా ఈ పార్కును సుందరీకరణ చేసేలా అధికారులను ఆదేశిస్తాను.

- ఎమ్మెల్యే ముఠా గోపాల్

డాక్టర్ బీఆర్.అంబేడ్కర్ భవన్‌ను పునరుద్ధరిస్తాం


క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ, తదితరులు

కవాడిగూడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): లోయర్ ట్యాంక్‌బండ్‌లోని రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ భవన్‌ను పునరుద్ధరించేందుకు కావాల్సిన అన్ని చర్యలు తీసుకుంటామని వైద్య ఆరోగ్య శాఖమంత్రి దామోదర రాజనర్సింహ హామీ ఇచ్చినట్లు తెలంగాణ షెడ్యూల్డ్ కులాల హక్కుల పరిరక్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డి.సుదర్శన్‌బాబు తెలిపారు. బుధవారం సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర డైరీ, క్యాలెండర్‌ను మంత్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దామోదర నరసింహ మాట్లాడుతూ, రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు ప్రభుత్వ ఉన్నతాధికారుల వివరాలు ఫోన్ నెంబర్లతో పాటు దళితులకు ఉపయోగపడేవిధంగా ఉన్న చట్టాలను పొందుపరిచి డైరీ, క్యాలెండర్‌ను రూపొందించినందుకు ఆయన అభినందించారు. దళితుల హక్కుల సాధన కోసం దళితులంతా ఐక్యంగా పోరాటం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. డైరీ, క్యాలెండర్‌ను రూపొందించడంలో ప్రధాన పాత్ర పోషించిన కె.వినోద్‌కుమార్, రుద్రారం శంకర్, కె.పరశరాముడును మంత్రి జ్ఞాపికలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్.నరసింహారావు, గణేష్ భూపాల్‌రావు, ఎపీఎస్‌సీ ఆర్పీఎస్ అధ్యక్షులు దాసరి యాదగిరి, నాయకులు డి.శంకర్, కృష్ణవేణి, స్టాలిన్, శివశంకర్, అశోక్, విజయశంకర్, కవిత, ప్రసాద్, థామస్ తదితరులు పాల్గొన్నారు.

అంబర్‌పేటను అభివృద్ధిలో అగ్రగామిగా నిలబెడతా : ఎమ్మెల్యే కాలేరు

అంబర్‌పేట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): అంబర్‌పేట నియోజకవర్గాన్ని అభివృద్ధిలో అగ్రగామిగా నిలబెడతామని ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్ అన్నారు. అంబర్‌పేట డివిజన్ ప్రేమ్‌నగర్ గ్రీన్‌ల్యాండ్ హోటల్ వద్ద రూ.15 లక్షల వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఎమ్మెల్యే కార్పొరేటర్ విజయ్‌కుమార్‌గౌడ్‌తో కలిసి ప్రారంభించి మాట్లాడారు. నియోజకవర్గంలోని అన్ని డివిజన్ల ప్రజల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జీహెచ్ఎంసీ డీఈ ప్రశాంతి, అంబర్‌పేట డివిజన్ బీఆర్ఎస్ అధ్యక్షుడు సిద్ధార్థ ముదిరాజ్ నాయకులు పాల్గొన్నారు.


పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కాలేరు వెంకటేష్

పబ్లిక్ పార్క్‌లను సుందరీకరించాలి : కార్పొరేటర్ పావని


పీపుల్స్‌పార్క్‌లో అధికారులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ పావనివినయ్‌కుమార్

చిక్కడపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): డివిజన్‌లోని పబ్లిక్‌పార్క్‌లను సుందరీకరించి మెరుగైన సౌకర్యాలు ఏర్పాటు చేయాలని గాంధీనగర్ కార్పొరేటర్ ఎ.పావనివినయ్‌కుమార్ అధికారులకు సూచించారు. డివిజన్‌లోని పీపుల్స్‌పార్కు, చిక్కడపల్లిలోని జనతాపార్క్, అష్టలక్ష్మీపార్క్‌ను బుధవారం ఆమె జీహెచ్ఎంసీ హార్టికల్చర్, స్ట్రీట్‌లైట్స్, ఇంజనీరింగ్ విభాగం అధికారులు ఆశిష్, సంజయ్, బాలునాయక్‌తో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ పార్క్‌ల అభివృద్ధికి ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించారు. సుందరీకరణతో పాటు అంధకారాన్ని తొలగించేందుకు అవసరం ఉన్న చోట్ల నూతన స్ట్రీట్ లైట్స్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు. పీపుల్స్‌పార్క్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుల ఫిర్యాదు మేరకు పార్క్‌లో వాటర్ ఫౌంటేన్, కూర్చునేందుకు నూతన బల్లల ఏర్పాటు, పిల్లలు ఆడుకునేందుకు కొన్ని ఆట పరికరాలను అమర్చాలని సూచించారు. చెత్తాచెదారం లేకుండా ప్రతిరోజూ చెత్తను తొలగించాలని జీహెచ్ఎంసీ సిబ్బందిని ఆదేశించారు. వాకర్స్ కోసం ప్రత్యేకమైన పాత్‌వే నిర్మించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ సికింద్రాబాద్ లోక్‌సభ జాయింట్ కన్వీనర్ ఎ.వినయ్‌కుమార్, డివిజన్ అధ్యక్షుడు వి.నవీన్‌కుమార్, నాయకులు శ్రీకాంత్, దామోదర్, పి. నర్సింగ్‌రావు, ఎం.ఉమేష్, ప్రకాష్‌యాదవ్, ఆనంద్‌రావు, సాయికుమార్, నీరజ్, పీపుల్స్‌పార్క్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు రంగరాజు, సభ్యులు విద్యాసాగర్, శ్రీనివాస్‌రావు, రజనికాంత్, ఆంజనేయులు, ప్రేమ్‌కుమార్, వినోద్‌జైన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

భూనిర్వాసితులకు న్యాయం చేయాలి

సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆంజనేయులు


భూనిర్వాసితుల ధర్నాలో పాల్గొన్న అధ్యక్షుడు నీరేటి ఆంజనేయులు, సోషలిస్టు పార్టీ ఆఫ్ తెలంగాణ అధ్యక్షురాలు సుభద్రారెడ్డి తదితరులు

కవాడిగూడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వం ప్రాజెక్టులు, పరిశ్రమల పేరుతో 2018 సంవత్సరంలో రంగారెడ్డి జిల్లా పరిధిలోని అనేక ప్రాంతాల్లో రైతుల నుంచి బలవంతంగా భూములను సేకరించి అన్యాయం చేసిందని, రేవంత్‌రెడ్డి ప్రభుత్వం భూనిర్వాసితులకు న్యాయం చేయాలని భూనిర్వాసితుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు నీరటి ఆంజేయులు ఆరోపించారు. బలవంతంగా లాక్కొన్న భూనిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బుధవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్‌లో తెలంగాణ సోషలిస్టు పార్టీ, భూనిర్వాసితుల సంఘం సంయుక్త ఆధ్వర్యంలో నిరసన ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా ఆంజనేయులు, సోషలిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షురాలు సుభద్రారెడ్డి హాజరయ్యారు. రేవంత్‌రెడ్డి ప్రభుత్వం స్పందించి ఇచ్చిన హామీల మేరకు రైతులు కోల్పోయిన భూములకు నష్టపరిహారం చెల్లించి, వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ ధర్నాలో సోషలిస్టు పార్టీ కన్వీనర్ కె.రెడ్డయ్య, కిసాన్ సభ నాయకులు లక్ష్మణ్, ఉపాధ్యక్షులు రమేష్‌నాయుడు, భూనిర్వాసితుల సంఘం ఉపాధ్యక్షులు సుప్పల నర్సింహులు, సహాయకార్యదర్శులు దయాకర్, నర్సింహులు, ఎండీ యూసుఫ్, బాలయ్య, కృష్ణయ్యగౌడ్, భూములుకోల్పోయిన రైతులు పాల్గొన్నారు.

దళితుల హత్యలపై సీఎం స్పందించడం లేదు: ఎమ్మార్పీఎస్

నల్లకుంట, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరుగుతున్న దళితుల హత్యలపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించడం లేదని మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి రాష్ట్ర ప్రధానకార్యదర్శి బోయిని ఎల్లేష్ మాదిగ ఆరోపించారు. దళితుల పట్ల కాంగ్రెస్ ప్రభుత్వం వివక్షత ప్రదర్శిస్తోందని విమర్శించారు. బుధవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ సూర్యాపేట జిల్లాలో వడ్లకొండ కృష్ణ దళిత యువకుడి పరువు హత్యపై స్పందించలేదని ధ్వజమెత్తారు. అయితే చిలుకూరు బాలాజీ ఆలయం పూజారిపై దాడిని సీఎం రేవంత్‌రెడ్డి ఫోన్‌చేసి ఖండించడంతోపాటు పోలీసు ఉన్నతాధికారులకు ఆదేశాలు జారీ చేశారని ఆయన గుర్తు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం మాదిగ కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, జైభీమ్ ప్రజాసమితి నాయకులు ఎస్.బాల్‌రామ్ మాదిగ, లంకా దానరి, శ్రీనాథ్, ఇంద్రశేఖర్, సూరి, అనిల్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడలు ఐక్యత, మానసిక ఉల్లాసానికి దోహదం


విజేతలకు సర్టిఫికెట్లు, మెడల్స్ అందజేస్తున్న ఇన్‌కం ట్యాక్స్ హైదారాబాద్ వన్ రేంజ్ ప్రిన్సిపల్ కమిషనర్ శివాజీ మోరే, నిర్వాహకుడు సుబ్బారెడ్డి తదితరులు

కవాడిగూడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): క్రీడలు ఐక్యత, మానసిక ఉల్లాసానికి ఎంతగానో దోహదపడతాయని ఇన్‌కం ట్యాక్స్ హైదరాబాద్ వన్ రేంజ్ ప్రిన్సిపల్ కమిషనర్ శివాజీ మోరే అన్నారు. బుధవారం ఇందిరాపార్కులోని టెన్నిస్ కోర్టులో సెంట్రల్ రెవెన్యూ స్పోర్ట్స్, కల్చరల్ బోర్డు ఆధ్వర్యంలో 54వ సౌత్ జోన్ స్పోర్ట్స్ మీట్ 2024-25 కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన టెన్నిస్ పోటీల్లో తెలంగాణ ఆంధ్ర, కేరళ, తమిళనాడు, పుదుచ్చేరి, గోవా తదితర రాష్ట్రాలకు చెందిన ఇన్‌కం ట్యాక్స్ ఉద్యోగులు ఈ పోటీల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫైనల్‌పోటీల్లో విజేతలైన వారికి ఇన్‌కం ట్యాక్స్ ప్రిన్సిపల్‌కమిషనర్ శివాజీ మోరే ముఖ్యఅతిథిగా హాజరై వారికి సర్టిఫికెట్లు, మెడల్స్ ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇన్‌కం ట్యాక్స్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగంలో విధినిర్వహణతో పాటు క్రీడల్లో రాణిస్తున్నారన్నారు. భవిష్యత్‌లో కూడా క్రీడల్లో రాణించి దేశానికి, రాష్ట్రానికి తమ డిపార్ట్‌మెంట్‌కు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సుబ్బారెడ్డి, విజువల్ కట్టతో పాటు ఉద్యోగులు ఐదు రాష్ట్రాల క్రీడాకారులు పాల్గొన్నారు.

పత్రికలకు నిండుదనం కార్టూన్‌లు

చిక్కడపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కార్టూన్‌లు పత్రికలకు నిండుదనం ఇస్తాయని రిటైర్డ్ ఐఏఎస్ అధికారి డా.కేవీ రమణాచారి అన్నారు. జీవీఆర్ కల్చరల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం రాత్రి త్యాగరాయగానసభలో డా.కేవీ రమణాచారి పుట్టినరోజు వేడుకల సందర్భంగా హాస్యానందం పత్రిక నిర్వహించిన కార్టూన్ పోటీల్లో పది మంది విజేతలకు బహుమతిప్రదానోత్సవ సభ జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న రమణాచారి మాట్లాడుతూ పత్రికా యాజమాన్యాలు కార్టూన్‌లకు ప్రాధాన్యం ఇవ్వడంతోపాటు వారికి తగిన గౌరవం పారితోషికం రూపంలో ఇవ్వాలని కోరారు. విజేతలైన కార్టూనిస్టులకు ప్రస్తుతం మూడువేల నగదు పురస్కారం అందజేస్తున్నారని రాబోయే ఏడాది ఐదు వేలు చేస్తామని తెలిపారు. ప్రముఖ కార్టూనిస్ట్ సరసి మాట్లాడుతూ కార్టూనిస్టులకు గుర్తింపు వస్తోందని తెలిపారు. రామరాజు శ్రీనివాసరావు, గుడిబండి వెంకటరెడ్డి, రామవరెడ్డి, నిర్మలాప్రభాకర్, లక్ష్మీనారాయణ, వెంకటదాసు పాల్గొన్నారు.

కుంభమేళా ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక సంగమం

హైదరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మహాకుంభమేళ ప్రపంచంలోనే అతిపెద్ద ఆధ్యాత్మిక సంగమంగా హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అభివర్ణించారు. బుధవారం కుటుంబంతో కలిసి ఉత్తర్‌ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ వెళ్లిన ఆయన మాఘ పౌర్ణమి పవిత్రదినాన్ని పురస్కరించుకుని త్రివేణీ సంగమంలో పవిత్రస్నానం చేశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయ మాట్లాడుతూ ప్రయాగ్‌రాజ్ సనాతన సంస్కృతికి వెలుగులు పంచుతోందన్నారు.

రమణీయంగా మల్లాది ఉష బృందం గానగోష్ఠి

చిక్కడపల్లి, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ గాయని మల్లాది ఉష బృందం నిర్వహించిన గానగోష్ఠి రమణీయంగా సాగింది. ప్రభుత్వ పూర్వ సలహాదారు డా కేవీ రమణాచారి పుట్టిన రోజు వేడుకల ముగింపు సందర్భంగా బుధవారం రాత్రి త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో మల్లాది ఉష బృందం అన్నమయ్య కీర్తనలు, రామదాసు కృతులను మధురంగా ఆలపించారు. గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి, తెలంగాణ మ్యారేజ్‌బ్యూరో జేఏసీ చైర్మన్ వంగాల బాల్‌రాజ్‌గౌడ్ ఈ సందర్భంగా గాయనీమణులను సత్కరించి మాట్లాడుతూ కొందరు మాత్రమే తమ పుట్టినరోజులను జరుపుకుంటూ, పరులకు ఆదర్శంగా నిలుస్తారన్నారు. రమణాచారి పుట్టిన రోజును కళాకారులు పండుగగా జరుపుకుంటారన్నారు. సభలో రచయిత్రి సుందరపల్లి శ్రీదేవి, సంఘసేవకులు జి.సీత పాల్గొన్నారు.

'ప్రధాన అర్చకుడిపై దాడి అప్రజాస్వామికం'

ముషీరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): రామరాజ్యం ముసుగులో డబ్బుల కోసం అర్చకులపై దాడి చేయడం అప్రజాస్వామికం అని కాంగ్రెస్ ముషీరాబాద్ నియోజకవర్గం బీ-బ్లాక్ కమిటీ ఉపాధ్యక్షుడు పట్నం నాగభూషణంగౌడ్ అన్నారు. బుధవారం ముషీరాబాద్‌లోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... ఆలయ ప్రధాన అర్చకుడు సౌందర రాజన్‌పై దాడి చేసిన అరాచక శక్తులను వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని కోరారు.

రెండో రోజూ రేషన్‌కార్డుల దరఖాస్తుల వెల్లువ

ముషీరాబాద్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): కొత్తరేషన్‌కార్డుల కోసం రెండో రోజు బుధవారం మీసేవా కేంద్రాలలో ప్రజలు పెద్ద ఎత్తున తరలివెళ్లి దరఖాస్తు చేసుకున్నారు. కొంత మంది పాత రేషన్‌కార్డులో కుటుంబ సభ్యుల పేర్లు ఉండడంతో తమకు మరొక కార్డు కావాలని దరఖాస్తు చేసుకునేందుకు వచ్చి, ప్రజల దరఖాస్తులను ఆన్‌లైన్‌లో స్వీకరించడం లేదు. దీనితో మీసేవా సిబ్బంది దరఖాస్తుదారులతో మాట్లాడుతూ పౌరసరఫరాల శాఖ కార్యాలయానికి వెళ్లి పాత రేషన్ కార్డులో ఉన్న పేర్లను తొలగించుకుని వస్తేనే ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరిస్తామని సూచించారు.

భక్తి శ్రద్ధలతో కుంభాభిషేకం, చండీ హోమం

కవాడిగూడ, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): లోయర్ ట్యాంక్‌బండ్‌లోని కనకాల కట్టమైసమ్మ దేవాలయ వార్షికోత్సవం సందర్భంగా కుంభాభిషేకం, చండీహోమాన్ని బుధవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. బుధవారం తెల్లవారుజాము నుంచి పూజలు ప్రారంభమయ్యాయి. అమ్మవారికి పంచామృత అభిషేకాలు, విశేష కుంకుమార్చనలు, ప్రత్యేక అలంకరణలు, అభిషేకాలు నిర్వహించారు. చండీ హోమం నిర్వహించి అమ్మవారికి మహా పూర్ణహుతి చేశారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఆలయ చైర్మన్ గోల్కొండ గౌతమ్‌కుమార్ పటేల్, ఆయన సతీమణి లత, ఆలయ ఈవో సొంటి శివరావు, ఆలయ ప్రధాన అర్చకులు సాత్విక్‌శర్మ, అర్చకులు రాజేశ్‌శర్మ, రాంబాబుశర్మ, ఆలయసీనియర్ అసిస్టెంట్ సతీష్, సిబ్బంది భక్తులు పాల్గొన్నారు.

శ్మశానవాటికలో పనులు పూర్తి చేయాలి

రాంనగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): బాగ్‌అంబర్‌పేట డివిజన్‌లోని మోహిన్ చెరువు శ్మశాన వాటికలో అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కార్పొరేటర్ బిపద్మావెంకటరెడ్డి జీహెచ్ఎంసీ అధికారులకు సూచించారు. మోహిన్ చెరువులో జరుగుతున్న అభివృద్ధి పనులను స్థానికులతో కలిసి బుధవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బి.వెంకటరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు శ్రీరాములు ముదిరాజ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కేసీఆర్‌ను కలిసిన కోలేటి

రాంనగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ధైర్యంగా పనిచేయండి. రాబోయేవి మంచి రోజులేనని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం చేయడం లేదని మాజీ సీఎం కేసీఆర్ చెప్పారని తెలంగాణ రాష్ట్ర పోలీసు శాఖ హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలేటి దామోదర్ గుప్తా తెలిపారు. బుధవారం మాజీ సీఎం కేసీఆర్‌ను ఎర్రవెల్లి ఫాంహౌస్‌లో దామోదర్‌గుప్తా మర్యాద పూర్వకంగా కలిశారు. రాష్ట్రంలోని తాజా రాజకీయాలు, కాంగ్రెస్ ప్రభుత్వ పనితీరు, బీఆర్ఎస్ ప్రభుత్వం పథకాల గురించి కేసీఆర్ చర్చించారని తెలిపారు.

ప్రతిపక్షాల తప్పుడు ప్రచారాన్ని తిప్పికొట్టాలి

రాంనగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): ఆరు గ్యారంటీల అమలుపై ప్రతిపక్షాలు చేస్తున్న తప్పుడు ప్రచారాన్ని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు తిప్పికొట్టాలని కాంగ్రెస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు డాక్టర్ రోహిణ్‌రెడ్డి సూచించారు. బుధవారం టీపీసీసీ మహిళా కాంగ్రెస్ ఉపాధ్యక్షురాలు చింతల నిర్మలారెడ్డి బర్కత్‌పురలో రోహిణ్‌రెడ్డిని మహిళా కాంగ్రెస్ పక్షాన ఆమె సత్కరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

మాదిగ అమరవీరుల కుటుంబాలను ఆదుకోవాలి

టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్

రాంనగర్, ఫిబ్రవరి 12 (ఆంధ్రజ్యోతి): మాదిగ అమరవీరుల కుటుంబాలను ప్రభుత్వం ఆదుకోవడంతోపాటు అమరుల కుటుంబానికి ప్రభుత్వ ఉద్యోగం, ఇందిరమ్మ ఇల్లు, రూ.50 లక్షల ఎక్స్‌గ్రేషియ కేటాయించాలని టీఎస్ ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు వంగపల్లి శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం విద్యానగర్‌లోని సంఘం కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎస్సీ వర్గీకరణ కోసం ఆరుగురు అమరులయ్యారని, వర్గీకరణ కోసం సురేందర్, రమేష్, మహేష్, భారతమ్మ, రాధ, మరొకరు ఆత్మాహుతికి పాల్పడ్డారని, వారు చేసిన ప్రాణత్యాగం వల్లనే నేడు ఎస్సీ వర్గీకరణ తెలంగాణ అసెంబ్లీలో బిల్లు ఆమోదింపచేసిందన్నారు. ఆ కుటుంబాలను ఆదుకోవాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. అమరవీరుల కుటుంబాలను ఆదుకోవడం కోసం మార్చి 1న ఇందిరాపార్కు వద్ద అమరవీరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కొట్టపింజర రమేష్, కొల్లూరి వెంకట్, వరిగడ్డి చందు, నాగరాజు, సురేష్, ధర్మారావు, శ్రీకాంత్, ఫణీంద్ర, శ్రీనివాస్, మారుతి పాల్గొన్నారు.